సాక్షి నల్లగొండ

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



విధి వంచితులు !
విధి వంచితులైన కొర్లపహాడ్‌కు చెందిన కంచర్ల నర్సింహాచారి కుటుంబం ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది. - 8లో



సృజనాత్మకతను వెలికితీయాలి
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని డీఈఓ భిక్షపతి అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
32° / 25°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ గడువు పెంపు

నల్లగొండ రూరల్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ పొందుటకు ఈనెల 16వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని దూరవిద్య కోఆర్డినేటర్ డాక్టర్ సుంకరి రాజారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సమాన అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ : 7382929758, 8919436579 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వృద్ధులకు అండగా నిలవాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి దీప్తి

నకిరేకల్: అధికారులతోపాటు స్వచ్ఛంద సంస్థలు.. సమాజంలోని వృద్ధులకు అండగా నిలవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, జడ్జి బి.దీప్తి అన్నారు. నకిరేకల్ మండలం తాటికల్ గ్రామ శివారులోని లయన్స్ వృద్ధాశ్రమంలో నకిరేకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లీగల్ సర్వీస్ అథారిటీ జిల్లా సెల్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆ క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ అధ్యక్షత జరిగిన ఈ సదస్సులో వృద్ధాశ్రమం చైర్మన్ బొల్లం కృష్ణమూర్తి, క్లబ్‌ప్రతినిధులు యల్లపు రెడ్డి యాదగిరిరెడ్డి, బి.ప్రకాష్‌రావు, ఎస్.రాం మోహన్‌రావు, పోతుల మల్లయ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి



విరాళాలు సేకరిస్తున్న రంగారెడ్డి తదితరులు

మిర్యాలగూడ అర్బన్: ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లు, సామగ్రి కోల్పోయి అనాథలుగా మిగిలిన వరద బాధితులకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మిర్యాలగూడలో వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మానవత్వంతో తోచిన ఆర్థికసాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముదావత్ రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బాండ్ల పాండు, మంగారెడ్డి, పరశురాములు, మల్లయ్య, సైదానాయక్, యేసు, మాధవరెడ్డి, నాగేందర్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఈనెల 20న నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును జయప్రదం చేయాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాస్, వంటపాక యాదగిరి, అద్దంకి రవీందర్, పన్నాల గోపాల్‌రెడ్డి, పర్వతాలు, గద్దపాటి దానయ్య, ఇందూరు సాగర్, సురేందర్, ముస్తఫా పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



నల్లగొండ టూటౌన్: అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్‌ను రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జి.జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎన్.భాస్కర్ రావు, గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, రమావత్ రవీంద్రకుమార్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్‌కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్, సైదిరెడ్డిలు కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేయాలని నిర్ణయం తీసుకున్న కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రగులుతున్న అసమ్మతి

బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై బయటపడుతున్న అసంతృప్తి

- కొన్నిచోట్ల లోలోపల.. మరికొన్నిచోట్ల బాహాటంగానే
- దేవరకొండ ఘటనతో చర్చనీయాంశంగా ఎమ్మెల్యేల తీరు
- ప్రత్యేక ఎజెండాతో ప్రజల్లోకి వెళ్తున్న ఆశావహులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్‌ఎస్ పార్టీలో అసంతృప్తి క్రమంగా బయటపడుతోంది. పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలపై సొంత పార్టీ నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కొన్ని చోట్ల లోలోపల అసంతృప్తి గూడుకట్టుకుని ఉండగా.. మరికొన్ని చోట్ల అసంతృప్తులు బహిరంగంగానే సమావేశాలు నిర్వహించి సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తిరుగుబావుటా ఎగురవేస్తున్నారు. దీనికి తోడు ఆశావహులు ఎమ్మెల్యేలపై వ్యతిరేకతను ప్రచారం చేయడంతోపాటు సొంత కార్యక్రమాలతో ముందుకెళ్తున్నారు. ఇప్పటి వరకు తెర వెనుక ఉన్న అసమ్మతి గళం ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ బయటకు వస్తోంది.

ఒక్కొక్కటిగా బయటకు..

దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్‌కు వ్యతిరేకంగా సొంత పార్టీ నేతలు ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆయనకు టికెట్ ఇవ్వొద్దంటూ తీర్మానం చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. డిండిలో నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకులంతా బుధవారం సమావేశమయ్యారు. మండల నాయకులతోపాటు దేవరకొండ మున్సిపల్ చైర్మన్, మాజీ చైర్మన్ వంటి ముఖ్య నేతలు ఈ సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. గతంలో కోదాడ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్‌కు వ్యతిరేకంగా అసమ్మతి నేతలు, మాజీ ఎమ్మెల్యే చందర్ రావు, నియోజకవర్గ మాజీ ఇంచార్జి కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి తదితరులు సమావేశమై అసంతృప్తి ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో ఆయనకు సహకరించబోమని, తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా ఐక్యంగా పనిచేస్తామని తీర్మానం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన ప్రగతి నివేదన సభలో మంత్రి కేటీఆర్.. ప్రస్తుత ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ను 40వేల మెజారిటీతో మరోసారి గెలిపించాలని కోరడంతో తనకు ఇక అభ్యర్థిగా అవకాశం ఇవ్వరని గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు రాజీనామా చేశారు.

లోలోపల అసంతృప్తి సెగలు..

మునుగోడు నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని ఉప ఎన్నికలకు ముందు వ్యతిరేకించిన వారు ఇప్పుడు బహిరంగంగా వ్యతిరేకించకపోయినప్పటికీ లోలోపల రగిలిపోతున్నారు. చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు ప్రస్తుతం ఎమ్మెల్యే పాల్గొనే కార్యక్రమాలకు హాజరు కావడం లేదు. ఎన్నికలు సమీపిస్తుండటంతో రాజుతో పాటు ఆశావహులు బొల్ల శివశంకర్, కర్నాటి విద్యాసాగర్, నారబోయిన రవి తమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. నాగార్జునసాగర్‌లోనూ ఎమ్మెల్యే నోముల భగత్‌కు ఎమ్మెల్సీ కోటిరెడ్డి వర్గానికి సఖ్యత లేదు. ఇద్దరు ఒకే వేదికపై ఉన్నా పలకరించుకునే పరిస్థితి లేదు. ఈ నియోజకవర్గంలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో టికెట్ సంపాదించాలనే లక్ష్యంతో బుసిరెడ్డి పాండురంగారెడ్డి తన ట్రస్టు పేరుతో నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మన్నెం రంజిత్ యాదవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి కూడా అదే ఆలోచనతో కార్యక్రమాలు చేస్తున్నారు. నల్లగొండలోనూ అదే పరిస్థితి నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఉన్నా, తనకు టికెట్ ఇవ్వాలని కోరుతూ పిల్లి రామరాజు యాదవ్ సొంతంగా ఫౌండేషన్ పెట్టుకొని కార్యక్రమాలు చేస్తున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన మోత్కుపల్లి నర్సింహులు ఇటీవల ఆలేరులో జరిగిన కార్యక్రమంలో అధిష్టానం ఆదేశిస్తే ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఎక్కడినుంచైనా పోటీ చేస్తానని ప్రకటించడం, ఎక్కడి నుంచి అనేది చెప్పకపోవడంలో చర్చనీయాంశంగా మారింది.

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ: ఈ నెల 15న నిర్వహించే స్వాతంత్య్ర వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లో స్వాతంత్య్రవేడుకల నిర్వహణపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఈ వేడుకలకు అన్ని శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా శాఖలు సాధించిన ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలన్నారు. ప్రగతిని తెలుపుతూ శకటాలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పరేడ్ గ్రౌండ్‌లో పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు ప్రతి డిపార్ట్‌మెంట్ గరిష్టంగా ముగ్గురికి మించకుండా ఉత్తమ పనితీరు కనపరిచిన ఉద్యోగుల వివరాలు డీఆర్‌ఓకు పంపించాలన్నారు. మెడికల్, ఎమర్జెన్సీ వైద్య సేవలు అందించేందుకు వైద్య బృందం అందుబాటులో ఉండాలని, నిరంతర విద్యుత్ సరఫరా, లైటింగ్, జనరేటర్ ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన కలిగి ఉండాలి

మిర్యాలగూడ: ఈవీఎం యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కర్ణన్ అన్నారు. గురువారం మిర్యాలగూడ ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈవీఎం ప్రదర్శన కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్‌ల గురించి ప్రత్యక్షంగా తెలియజేయాలన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ అనిల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సందదర్శన

దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌ను కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ గురువారం సందర్శించారు. ప్లాంట్ నిర్మాణ పనుల పురోగతిని జెన్‌కో అధికారులు పవర్ ప్లాంట్ ప్రెజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జెన్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ సచ్చిదానందం, ఎస్‌ఈ సమ్మయ్య, ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ బుచ్చయ్య తదితరులు ఉన్నారు.



యాదాద్రి పవర్‌ప్లాంట్ వద్ద అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

నేడు జాబ్‌మేళా

నల్లగొండ: వృత్తివిద్యా (ఒకేషనల్) కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ శుక్రవారం నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో అప్రెంటిషిప్ కం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఐఈఓ దస్రూ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021–2023 విద్యాసంవత్సరంలో పాసైన విద్యార్థులు ఈ మేళాకు అర్హులని పేర్కొన్నారు. అప్రెంటిషిప్‌నకు ఎంపికైన వారికి ఉపకార వేతనం అందించబడుతుందని, తర్వాత ఉద్యోగ, ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాలో ఎంపికైన వారికి ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు. పూర్తి బయోడేటా, సర్టిఫికెట్లతో ఉదయం 9గంటలలోపు హాజరు కావాలని కోరారు.

1.30 లక్షల మంది రైతులకు లబ్ధి

రూ.లక్షలోపు రుణమాఫీకి సీఎం గ్రీన్‌సిగ్నల్

- ప్రక్రియ ప్రారంభించాలని అధికారులకు ఆదేశం
- విడతల వారీగా నిధులు జమచేస్తామని ప్రకటన
- ఆనందంలో పంటరుణం తీసుకున్న రైతాంగం



నల్లగొండలో సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

నల్లగొండ అగ్రికల్చర్: గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షలోపు ఉన్న రైతుల పంట రుణాలను మాఫీ చేయడానికి తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 2018 డిసెంబర్ 11లోపు రూ.లక్ష వరకు పంటరుణాలు తీసుకున్న రైతులందరివీ మాఫీ కానున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా 1.30 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

తొలుత రూ.25వేలలోపు మాఫీ

అయితే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం తొలుత రూ.25 వేల లోపు పంట రుణాలు తీసుకున్న రైతులందరివీ 2019 సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేసింది. ఆ తర్వాత 2020లో రెండో విడతలో రూ.50వేల లోపు ఉన్న రుణాలను మాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ నిధుల లేమితో కేవలం రూ.39 వేలలోపు ఉన్న పంటరుణాలను మాత్రమే మాఫీ చేసింది. అప్పటి వరకు జిల్లాలోని 1.20లక్షల రైతులకు సంబంధించి సుమారు రూ.367 కోట్ల వరకు మాఫీ చేసినట్లు సమాచారం.

మూడేళ్లుగా రైతుల నిరీక్షణ

ఆ తర్వాత గత మూడేళ్లుగా రైతుల పంటరుణాల మాఫీ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ పట్టించుకోలేదు. దీంతో ప్రభుత్వం రుణమాఫీ ఎప్పుడు చేస్తుందోనని నిరీక్షిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో రుణం ఇచ్చిన బ్యాంకర్లు రుణానికి సంబంధించిన వడ్డీని చెల్లించి రుణాలను రీ షెడ్యూల్ చేసుకోవాలని రైతులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో సగానికిపైగా రైతులు రీషెడ్యూల్ చేసుకోకపోవడంతో వీరిని బ్యాంకర్లు డీఫాల్టర్‌గా ప్రకటించి తిరిగి పంటరుణాలు ఇవ్వకుండా పక్కన పెట్టారు. మరి కొన్ని బ్యాంకులు రైతుబంధు పథకం డబ్బులను రైతులు తీసుకోకుండా వారి ఖాతాలను హోల్డ్‌లో పెట్టారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షలోపు పంటరుణాల మాఫీ ప్రక్రియను ప్రారంభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విడతల వారీగా..

అయితే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన విధంగా 2018 డిసెంబర్ 11లోపు పంటరుణం ఎంత ఉందో అంతే రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. రుణాలు రీషెడ్యూల్ చేసుకోకపోవడంతో రైతులు తీసుకున్న రుణం వడ్డీతో కలిపి రెండింతలయ్యే అవకాశం ఉంటుందని బ్యాంకర్లు పేర్కొంటున్నారు. మిగతా డబ్బులు రైతులు చెల్లించాల్సి వస్తుందని చెబుతున్నారు. 2018 డిసెంబర్ 11 తర్వాత తీసుకున్న రైతుల రుణాలను ప్రభుత్వం మాఫీ చేయదు. రుణమాఫీని విడతల వారీగా ఖాతాల్లో జమచేస్తామని ప్రకటించింది. ప్రభుత్వ తాజా ప్రకటనతో జిల్లాలో 1.30లక్షల మంది రైతులకు సుమారు రూ.600 కోట్లకుపైగా వారి ఖాతాల్లో జమకానున్నట్లు సమాచారం. రాష్ట్ర స్థాయిలో రుణమాఫీ ప్రక్రియను మానిటరింగ్ చేస్తున్నందున జిల్లా వ్యవసాయ శాఖకు గాని, లీడ్ బ్యాంకు గాని గురువారం రాత్రి వరకు ఎలాంటి సమాచారం అందలేదు.

ఎంతో సంతోషంగా ఉంది



2018 సంవత్సరానికి ముందు కొండమల్లేపల్లి యూనియన్ బ్యాంకులో రూ.లక్ష వరకు పంటరుణం తీసుకున్నాను. ప్రతి సంవత్సరం వడ్డీ కడుతూ రీషెడ్యూల్ చేసుకుంటున్నాను. తాజాగా ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉంది.

– గంధం సురేష్, రైతు, కొండమల్లేపల్లి

విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



నల్లగొండ బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో మాత్రలు వేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ టౌన్: విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలను తీసుకోవడం చాలా అవసరమని, ఆరోగ్యంగా ఉంటేనే చదువుల్లో రాణించగలుగుతారని జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. గురువారం నల్లగొండలోని మునుగోడు రోడ్డులో గల ప్రభుత్వం బీసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించిన అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ అన్నిమళ్ల కొండల్‌రావు మాట్లాడుతూ ఈ మాత్రలను భోజనం తిన్న తర్వాత వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ జమీర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు అభిమన్యు శ్రీనివాస్, ఎడ్ల శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్లప్ప పాల్గొన్నారు.

సర్కారు దవాఖానాల్లో.. ప్రసవాలు పెరిగాయి

- ఆస్పత్రులకు తరలి వస్తున్న గర్భిణులు
- మెరుగైన వసతులు..ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహమే కారణం
- నల్లగొండ జీజీహెచ్‌లో రికార్డు స్థాయిలో కాన్పులు



నల్లగొండ జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో బారులుదీరిన గర్భిణులు

నల్లగొండ టౌన్: గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేయించుకోవడానికి వెళ్లాలంటేనే భయపడిన గర్భిణులు.. ఇప్పుడు బారులుదీరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్పత్రులను ఆధునీకరించి సకల సదుపాయాలు కల్పించడంతో పాటు అన్నిరకాల పరీక్షల కోసం అత్యాధునిక పరికాలను అందుబాటులో ఉంచింది. దీంతో గర్భిణులు ప్రసవాల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. గతంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో 60 శాతం కాన్పులు జరిగితే ప్రభుత్వ ఆస్పత్రుల్లో 40 శాతం మాత్రమే జరిగేవి. ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ప్రస్తుతం 60నుంచి 65శాతం కాన్పులు ప్రభుత్వాస్పత్రుల్లోనే చేస్తుండగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో కేవలం 35 నుంచి 40శాతమే జరుగుతున్నాయి.

పీహెచ్‌సీల్లో నమోదు..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 24 గంటల పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రసవాలు పెంచాలని గతంలోనే ప్రభుత్వం ఆదేశించింది. ఆస్పత్రులకు అవసరమైన గైనకాలజిస్టులు, స్టాఫ్ నర్సులను నియమించింది. దీంతో జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రితో పాటు మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ ఏరియా ఆస్పత్రులు, నకిరేకల్, మర్రిగూడ సీహెచ్‌సీలు, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల కోసం వస్తున్న వారి సంఖ్య పెరిగింది. పీహెచ్‌సీ స్థాయిలో గర్భిణులను నమోదు చేసుకోవడం, మూడు నెలలు నిండిన తర్వాత చెకప్‌ల కోసం ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు నెలనెలా తీసుకువస్తుండడంతో ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు పెరగుతున్నాయి.

ఏప్రిల్ 2022 నుంచి జూలై 31 వరకు కాన్పులు ఇలా

ప్రభుత్వ		ప్రైవేట్
7742	నార్మల్	2322
10,022	సిజేరియన్	10,257
17,764	మొత్తం	12,579

జీజీహెచ్‌లో రికార్డు స్థాయిలో..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో రికార్డు స్థాయిలో కాన్పులు జరుగుతున్నాయి. ఆస్పత్రిలో అందిస్తున్న మెరుగైన వైద్యంతోపాటు నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యమిస్తుండడంతో కాన్పుల కోసం అధిక సంఖ్యలో వస్తున్నారు. 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మొత్తం 17,764 కాన్పులు జరగ్గా ఒక్క జీజీహెచ్‌లో 4,374 సాధారణ కాన్పులు, 5,655 సిజేరియన్లతో కలిపి మొత్తం 10,029 (57 శాతం) కాన్పులు చేసి రికార్డును సాధించింది.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం



ప్రభుత్వ అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించింది. పీహెచ్‌సీ స్థాయిలోనే గర్భిణుల నమోదు నుంచి నెలనెలా చెకప్ చేస్తున్నారు. అక్కడ కాన్పు జరిగే అవకాశం లేకుంటే ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు దగ్గరుండి ఏరియా లేదా జీజీహెచ్‌కు తీసుకెళ్తున్నారు. మెరుగైన వైద్యం అందిస్తున్నందునే గర్భిణులు ప్రైవేట్‌కు వెళ్లకుండా ప్రభుత్వాస్పత్రులకు వస్తున్నారు.

– అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

కేసీఆర్, న్యూట్రిషన్ కిట్ల పంపిణీతో..

రాష్ట్ర ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రవేశపెట్టిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రులకు కాన్పుల కోసం వస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, మగబిడ్డ పుడితే రూ.12 వేలు తల్లి ఖాతాలో జమచేస్తున్న విషయం తెలిసిందే. కాన్పు అనంతరం ఆస్పత్రి నుంచి వెళ్లేటప్పుడు కేసీఆర్ కిట్ ఇవ్వడంతోపాటు ప్రభుత్వ వాహనంలో ఇంటికి పంపిస్తున్నారు. గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను అందించడం ద్వారా రక్తహీనతకు చెక్ పెట్టవచ్చనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది.

రిజర్వ్‌డ్ మద్యం దుకాణాలకు లక్కీ డ్రా

- ఎస్సీ, ఎస్టీ, గౌడలకు 52 షాపుల కేటాయింపు
- నేటి నుంచి మద్య టెండర్లకు దరఖాస్తుల స్వీకరణ



లక్కీ డ్రా ద్వారా రిజర్వేషన్ షాపులు ఎంపిక చేస్తున్న కలెక్టర్ కర్ణన్, ఇతర అధికారులు

నల్లగొండ రూరల్: మద్యం దుకాణాల టెండర్లలో భాగంగా రెండేళ్లకు (2023–25 సంవత్సరాలకు) గాను రిజర్వేషన్ల ప్రకారం కేటాయించే మద్యం షాపులను గురువారం నల్లగొండలో కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా పద్ధతిన ఎంపిక చేశారు. జిల్లాలో మొత్తం 155 మద్యంషాపులు ఉండగా 52 మద్యం షాపులు ఎస్సీ, ఎస్టీ, గౌడలకు రిజర్వేషన్ కింద కేటాయించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి కమిటీ సభ్యులైన జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి ఎల్.శ్రీనివాస్, బీసీ సంక్షేమ అధికారి ఖాజానాజీమ్‌అలీ, గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్ సమక్షంలో డ్రా తీశారు. ఇందులో గౌడలకు 34 షాపులు, ఎస్సీలకు 14, ఎస్టీలకు 4 షాపులు కేటాయించారు. మిగిలిన 103 మద్యం షాపులను జనరల్ స్థానాలుగా కేటాయించారు.

ప్రతి దరఖాస్తుకు రూ.2లక్షల డీడీ

మద్యం టెండర్లను శుక్రవారం నుంచి ఈ నెల 18వ తేదీ సాయంత్రం 6గంటల వరకు స్వీకరిస్తామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సంతోష్ తెలిపారు. 21న డ్రా ద్వారా ఎంపిక చేస్తామని, డిసెంబర్ 1న కొత్త షాపులు ప్రారంభించాల్సి ఉందన్నారు. ప్రతి దరఖాస్తుకు రూ. 2లక్షల డీడీ చెల్లించాలన్నారు.

క్లుప్తంగా

కుమారుడితో పాటు మహిళ అదృశ్యం

నకిరేకల్: మండలంలోని నెల్లిబండ గ్రామానికి చెందిన ఓ మహిళ తన రెండేళ్ల కుమారుడితో పాటు అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లిబండ గ్రామంలో నివాసముంటున్న బుడిగె యాదగిరి జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం యాదగిరి భార్య తన రెండేళ్ల చిన్నకుమారుడిని తీసుకొని ఇంటికి వెళ్లిపోయింది. సాయంత్రం యాదగిరి ఇంటికి వచ్చేసరికి పెద్ద కుమారుడు మాత్రమే ఇంటి వద్ద ఉండగా.. భార్య, చిన్నకుమారుడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

గ్రామ పంచాయతీ కార్మికుడి ఆత్మహత్యాయత్నం



చేతిలో పెట్రోల్ బాటిల్‌తో పంచాయతీ కార్మికుడు

వలిగొండ: ఒంటిపై పెట్రోల్ పోసుకొని గ్రామ పంచాయతీ కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన వలిగొండ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తమ సమస్యలు పరిష్కరించాలని గత 29 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండడంతో వలిగొండ మండల కేంద్రంలో చెత్త పేరుకుపోయింది. దీంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్లరేపాక గ్రామానికి వెళ్లే దారిలోని చెత్తను జేసీబీ సహాయంతో ఎత్తి ట్రాక్టర్‌లో పోసి తీసుకెళ్తుండగా, విషయం తెలుసుకున్న పంచాయతీ కార్మికులు అక్కడకు చేరకొని అడ్డుకున్నారు. అదే సమయంలో కొండె నర్సింహ అనే కార్మికుడు జేసీబీ పైకి ఎక్కి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. పక్కనే ఉన్న కార్మికులు అతడి చేతిలో నుంచి పెట్రోల్ బాటిల్ లాక్కొని నిలువరించారు. అనంతరం భువనగిరి–చిట్యాల ప్రధాన రహదారిపై పంచాయతీ కార్మికులు బైఠాయించి ధర్నా నిర్వహించారు. రోడ్డుపై వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచాయతీ కారికులకు నచ్చచెప్పి ధర్నాను విరమింపజేశారు.

యాదాద్రి ఆలయంలో గోవా మంత్రి పూజలు



గోవా మంత్రి విశ్వజిత్‌రాణేకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని గోవా రాష్ట్ర ఆరోగ్య, పట్టణాభివృద్ధి, పట్టణ, గ్రామ ప్రణాళికా మంత్రి విశ్వజిత్‌రాణే, ఆయన సతీమణి దేవియరాణేతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శ్రీస్వామిని దర్శించుకున్న మంత్రి దంపతులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

విధి వంచితులు !



భర్తకు అన్నం తినిపిస్తున్న పద్మ



గదిలో గొలుసుతో కట్టి బంధించబడిన శైలజ

- ఇంటిపెద్దకు పక్షవాతం, భార్యకు ఫైలేరియా, కూతురు మానసిక దివ్యాంగురాలు
- ఆ.. కుటుంబాన్ని వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు
- పూటగడవక దుర్భర జీవనం
- ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని వేడుకోలు

విధి వైపరీత్యమంటే ఇదేనేమో. పక్షవాతంతో కుటుంబ పెద్ద కదలలేని స్థితి. భార్యకు ఫైలేరియా.. ఇక కూతురు మానసిక దివ్యాంగురాలు. ఇలా వెంటాడుతున్న అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పూట గడవక జీవచ్ఛవాలుగా బతుకీడుస్తున్న ఓ కుటుంబ దీనగాథ ఇదీ. ఆలనాపాలన చూసే వారు లేక ఆపన్నహస్తం అందించాలని ఆ కుటుంబం దాతలను వేడుకుంటోంది.

కన్నీటి గాథ

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామానికి చెందిన కంచర్ల నర్సింహాచారి వ్యవసాయ బావుల విద్యుత్ పంపుసెట్లు మరమ్మతులు చేసే మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నాలుగేళ్ల క్రితం ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని ఎడమ కాలు విరిగిపోయింది. చికిత్సకు రూ.2లక్షలు ఖర్చు చేసినా నేటికీ విరిగిన కాలు కదపని పరిస్థితి. ఇది ఇలా ఉండగానే నెల రోజుల క్రితం కుడి కాలుకు పక్షవాతం వచ్చి మంచానికే పరిమితమయ్యాడు. ఆయుర్వేదం, హోమియోపతి అంటూ ఎన్నో ఆస్పత్రులు తిరిగి రూ.50వేల వరకు ఖర్చు చేసినా ఫలితం లేకుండా పోయింది.

కూతురు పరిస్థితి దయనీయం..

ఇక నర్సింహాచారి కూతురు శైలజ(20)ది దారుణమైన పరిస్థితి. 15 ఏళ్ల వయసులో ఉండగా మూర్ఛవ్యాధి బారిన పడింది. క్రమం తప్పకుండా ఆస్పత్రికి తీసుకెళ్తూ ప్రతి నెలా రూ.3వేల విలువైన మందులు వాడటంతో వ్యాధి అదుపులో ఉంది. అయితే తండ్రి నర్సింహాచారి రోడ్డు ప్రమాదానికి గురికావటంతో ఆ కుటుంబం పూట గడవటమే గగనంగా మారింది. ఈ తరుణంలో కూతురు శైలజ మూర్ఛవ్యాధికి మందులు కొనడం భారంగా మారింది. నాలుగేళ్లుగా మందులు లేకపోవటంతో వ్యాధి ముదిరింది. ఒంటిపై కనీసం బట్టలు కూడా ఉంచుకునే సోయి లేకుండా మానసిక స్థితి కోల్పోయింది. తల్లిదండ్రులతో పాటు ఇంటికి వచ్చిన వారిపై దాడి చేస్తుండటంతో గొలుసులతో కట్టి ఓ గదిలో బంధించారు. గదిలోని మంచంపైనే భోజనం, కాలకృత్యాలు తీర్చుకునే దుస్థితి నెలకొంది. ఏదైనా ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తే వ్యాధిని కొంత వరకు తగ్గించ వచ్చునని, మానసిక స్థితిలో మార్పురావచ్చని వైద్యులు తెలిపారు. కూతురును అస్పత్రికి తీసుకెళ్లటానికి మనుషులు, చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి.

సాయం చేయాల్సిన వివరాలు
పేరు : కూరెళ్ల నర్సింహాచారి
ఖాతా నంబర్ : 20263157328
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నకిరేకల్
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్‌బీఐఎన్ 0015352

నరకయాతన అనుభవిస్తున్నా..



20 ఏళ్లు వచ్చినా మా కూతురు ఆరోగ్యం మెరుగుపడటం లేదు. నా భర్త బాగున్న రోజుల్లో రోజుకు రూ.500 తెచ్చేవాడు. ప్రస్తుతం ఆయన మంచానికే పరిమతం అయ్యాడు. ఖరీదైన వైద్యం చేయించ లేక, గదిలో కుమార్తె బాధ చూడలేక నిత్యం నరకయాతన అనుభవిస్తున్నా. నాతో పాటు, నా కూతురుకు అధికారులు పింఛన్ మంజూరు చేయాలి. మా కూతురును ఏదైనా ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించాలి. దాతలు స్పందించి ఆర్థికసాయం అందజేసి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

– కంచర్ల పద్మ, కొర్లపహాడ్

అన్నీ తానై సపర్యలు చేస్తూ..

నర్సింహాచారి భార్య పద్మ ఫైలేరియా వ్యాధి బారిన పడింది. కూలి పనులకు వెళ్లేందుకు కూడా వీలు కావటం లేదు. ఫైలేరియా వ్యాధి ధ్రువీకరణ పత్రం ఉన్నా ఆమెకు పింఛన్ మంజూరు కాలేదు. నర్సింహాచారికి నెలనెలా వచ్చే ఆసరా పింఛన్ డబ్బులు, రేషన్ బియ్యంతోనే ఆ కుటుంబం దుర్భర జీవనం గడుపుతోంది. లేవలేని స్థితిలో ఉన్న భర్తకు, మానసిక స్థితి సరిగా లేని కూతురుకు అన్నీ తానై పద్మ సేవలు చేస్తూ నరకయాతన అనుభవిస్తోంది. ఎవరైనా దాతలు సహరించి ఆర్థికసాయం అందిస్తే భర్త, కూతురుకు వైద్యం చేయిస్తానని అర్థిస్తోంది.

పీఏసీఎస్ చైర్మన్‌పై వీగిన అవిశ్వాసం

- కోరం లేకపోవడంతో వీగినట్లు ప్రకటించిన అధికారులు

మర్రిగూడ: మండల పీఏసీఎస్ చైర్మన్ పందుల యాదయ్యపై డైరెక్టర్లు అవిశ్వాసం పెట్టారు. దీంతో గురువారం డీసీఓ జిల్లా అధికారులు పీఏసీఎస్ వద్ద బల నిరూపణకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చైర్మన్‌తో పాటు 19మంది డైరెక్టర్లు ఈ సమావేశానికి హాజరు కావాల్సి ఉండగా కేవలం ఆరుగురు డైరెక్టర్లు మాత్రమే హాజరు కాగా కోరానికి సరిపడా డైరెక్టర్లు లేకపోవడంతో అవిశ్వాసం వీగినట్లు డీసీఓ రాజేందర్‌రెడ్డి, ఈసీఏఓ గోలి శ్రీనివాస్ ప్రకటించారు.

రైతుల ధర్నా..

అధికారులు సమావేశం నుంచి బయలుదేరే ముందు పలువురు రైతులు పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ధాన్యంలో 10కేజీలకు పైగా తరుగు తీసి రూ.45లక్షల పైచిలుకు అవినీతి జరిగిందని రైతులు ఆరోపిస్తే గతంలో జిల్లా అధికారులు రికార్డులు స్వాధీనం చేసుకున్నారని, కుంభకోణానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోని న్యాయం చేస్తామని హామీ ఇచ్చి నెలలు గుడుస్తున్నా నేటి వరకు న్యాయం ఎందుకు చేయడం లేదని అధికారులను నిలదీశారు. అనంతరం కొద్దిసేపు రైతులు ధర్నా నిర్వహించి పీఏసీఎస్‌కు తాళం వేయడంతో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ కె.రంగారెడ్డి ఘటన స్థలానికి చేరుకోని రైతులకు నచ్చజెప్పడంతో శాంతించారు.



పీఏసీఎస్ డైరెక్టర్లతో మాట్లాడుతున్న జిల్లా అధికారులు

సెల్ టవర్ల సామగ్రి చోరీ ముఠా అరెస్ట్

కోదాడరూరల్: సెల్ టవర్లలోని సామగ్రిని చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను గురువారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్లకు చెందిన లక్ష్మీనారాయణ, తెలంగాణలోని వనపర్తికి చెందిన యువరాజ్ గతంలో సెల్ టవర్లలో టెక్నీషియన్‌లుగా పనిచేస్తున్న సమయంలో పరిచయమయ్యారు. కాగా వారు టెక్నీషియన్‌లుగా పని మానేసి సెల్ టవర్లలో ఉండే 4జీ, 5జీ బేస్‌బ్యాండ్ యూనిట్లను చోరీ చేసి విక్రయించుకొని డబ్బులు సంపాందించాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు వారు కోదాడ, మునగాల, మహబూబ్‌నగర్ జిల్లాలోని కొత్తకోట, కొల్లాపూర్, వేమూరు, గట్టు, హైదరాబాద్‌లోని బాలానగర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ ప్రాంతాల్లో 17 చోట్ల సెల్ టవర్లలోని బేస్‌బ్యాండ్ యూనిట్లను చోరీ చేసి వారికి పరిచయం ఉన్న హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ హానజ్‌ఖాన్‌కు విక్రయించారు.

వాహనాలు తనిఖీ చేస్తుండగా..

గురువారం రాష్ట్ర సరిహద్దు అయిన రామాపురం క్రాస్ రోడ్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. కోదాడ ప్రాంతంలో చోరీ చేసిన బేస్‌బ్యాండ్‌లను హానజ్‌ఖాన్‌కు చూపించేందుకు అతడిని లక్ష్మీనారాయణ, యువరాజ్ ఆంధ్రప్రదేశ్ వైపు నుంచి కోదాడకు తీసుకొస్తున్నారు. వారు పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి వివరాలు అడగగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నారు. అయితే దొంగిలించిన బేస్‌బ్యాండ్‌లను ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన మరో వ్యక్తికి విక్రయించినట్లు వారు పోలీసుల విచారణలో ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి ఓ బేస్‌బ్యాండ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరు చోరీ చేసిన బేస్‌బ్యాండ్ విలువ దాదాపు రూ.కోటి వరకు ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు.

నాగారంలో విషాదం



నాగారం మండల కేంద్రంలో ఇంటి గోడ కూలి మృతిచెందిన ముగ్గురిని పోస్టుమార్టం కోసం ట్రాక్టర్‌లో తరలిస్తున్న పోలీసులు



సూర్యాపేట జనరల్ ఆస్పత్రిలో పార్థివదేహాలకు నివాళులర్పిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్



ప్రమాద వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్

బాలింత కడుపులో ఇన్‌ఫెక్షన్

- డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యుల ధర్నా



కమలా నెహ్రూ ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న బాలింత కుటుంబ సభ్యులు, బంధువులు

నాగార్జునసాగర్: డాక్టర్ల నిర్లక్ష్యంతోనే బాలింతకు ఇన్‌ఫెక్షన్ సోకిందని ఆరోపిస్తూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు గురువారం నాగార్జునసాగర్‌లోని కమలా నెహ్రూ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు. వివరాలు.. నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని పైలాన్ కాలనీకి చెందిన ఎర్రవల్లి సబిత జూలై 7వ తేదీన డెలివరీ కోసం హిల్‌కాలనీలోని కమలా నెహ్రూ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా డాక్టర్లు ఆపరేషన్ చేశారు. అనంతరం డిశ్చార్జి అయ్యింది. రెండు రోజుల తర్వాత ఆమెకు ఇన్‌ఫెక్షన్ వచ్చి జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు తిరిగి ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ చికిత్స అందించలేమని మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తీసుకెళ్లమని అక్కడి డాక్టర్లు సూచన చేశారు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్లలో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు పరిశీలించి కడుపులో పూర్తిగా ఇన్‌ఫెక్షన్ అయ్యిందని గుంటూరుకు తీసుకెళ్లమని సూచించడంతో అక్కడకు వెళ్లారు. గుంటూరులో ఓ ఆస్పత్రిలో ఇన్‌ఫెక్షన్ తొలగేందుకు వైద్యం చేయించగా.. రూ.6లక్షలకు పైగా ఖర్చయ్యాయని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అయినా ఇప్పటికీ సబిత ఆరోగ్య పరిస్థితి బాగాలేదని వాపోయారు. కమలా నెహ్రూప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఇలా జరిగిందని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సబిత కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. ఈ విషయమై సంబంధిత ఉన్నతాధికారులకు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా విజయపురిటౌన్ ఎస్‌ఐ సంపత్ గౌడ్ అక్కడకు చేరుకొని వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ భానుప్రకాశ్ మాట్లాడుతూ.. సబిత ఆరోగ్యం పరిస్థితి బాగా ఉన్న సమయంలోనే డిశ్చార్జి చేశామని తెలిపారు. డాక్టర్ల తప్పిదమేమీ లేదని అన్నారు. విచారణలో డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేటితో నీటి విడుదలకు 56ఏళ్లు పూర్తి

- 1967 ఆగస్టు 4న సాగర్ కాల్వలకు నీటిని విడుదల చేసిన ఇందిరాగాంధీ



నీటిని విడుదల చేసి మాట్లాడుతున్న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ (ఫైల్)

నాగార్జునసాగర్: రెండు తెలుగు రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రా వరప్రదాయినీ నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కాల్వలకు నీటిని విడుదల చేసి నేటికి 56ఏళ్లు నిండాయి. కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ మానవనిర్మిత ఆనకట్టల్లో ప్రపంచంలోనే అతిపెద్దది. 1967 ఆగస్టు 4న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేసి, నాగార్జునసాగర్ ప్రాజెక్టును జాతికి అంకితం చేసింది. 1955 డిసెంబర్ 10న నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ శంకుస్థాపన చేయగా 12సంవత్సరాల అనంతరం ఆయన కుమార్తె ఇందిరాగాంధీ సాగర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. దీంతో ఆనాడు రైతుల కళ్లలో ఆనందం తొనికిసలాడింది. కాల్వల్లో నీరు పారడంతో బీళ్లుగా ఉన్న భూముల్లో రైతులు సిరులు పండిస్తున్నారు. నాడు కటిక దరిద్రాన్ని అనుభవించిన రైతులు నేడు ఆర్థికంగా బలపడ్డారు. తాగు, సాగునీటికి కొదవలేకుండా పోయింది. నాటి నుంచి నేటి వరకు అధిక సంవత్సరాలు ఆగస్టు మాసంలోనే కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ఏడాది కూడా ఎగువ కురుస్తున్న వర్షాలతో ఆగస్టు మాసంలోనే ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తారని రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



మునుగోడులో తొలిమెట్టు శిక్షణను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

చిట్యాల, మునుగోడు, నార్కట్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసి వారిలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని డీఈఓ బి.భిక్షపతి అన్నారు. తొలిమెట్టు కార్యక్రమంపై చిట్యాలలోని జెడ్పీహెచ్‌ఎస్, మునుగోడు ఎమ్మార్సీ, నార్కట్‌పల్లిలో జరుగుతున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్)శిక్షణను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. శిక్షణ పొందడం వల్ల ప్రతి ఉపాధ్యాయుడు.. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా బోధించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. చిట్యాలలో జరిగిన కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ కోర్సు ఇన్‌చార్జి డైరెక్టర్ గోగికార్ మాధవి, రిసోర్స్ పర్సన్స్ బొప్పని యాదయ్య, మర్యాద అశోక్‌రెడ్డి, ఐఈఆర్‌పీ బోయ శ్రీనివాస్, సీఆర్‌పీ జయకాంత్, జాన్, ప్రవళిక, వరలక్ష్మి, మునుగోడులో కోర్స్ డైరెక్టర్ టి.యాదయ్య, డీఆర్‌పీ తుల శ్రీనివాస్, ఎమ్మార్పీలు సయ్యద్ యూసుఫ్‌పాష, నాగేశ్వరావు, పారిజాత, రవికుమార్, దివ్య, నర్సింహ, సతీష్, నాగరాజు, పీఆర్‌సీలు సైదులు, నర్సింహ, సతీష్, నాగరాజు, నార్కట్‌పల్లిలో కోర్స్ డైరెక్టరు కాశయ్య, కోర్సు ఇన్‌చార్జి కవిత, ఆర్‌పీ కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, సీసీఓ బాజా మురళి, సీఆర్‌పీ నాగమణి, ఎంఈఎస్ ఆస్మా తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- మూడు గేట్ల ద్వారా నీటి విడుదల

కేతేపల్లి : ఎగువ ప్రాంతం నుంచి వరద వస్తుండడంతో మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో అధికారులు గురువారం మూడు క్రస్టు గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 5,721 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి మూసీకి 5,427 క్యూసెక్కుల వరదనీరు వస్తుంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 642.90 అడుగుల వద్ద ఉంది. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 499క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.92 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు వెల్లడించారు.

సముద్రం పాలైన 16.39 టీఎంసీల నీరు..

ఈఏడాది వేసవిలోనే మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో మొదటగా జూన్ 5న అధికారులు ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. నాటి నుంచి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతుండటంతో నిత్యం గేట్లను పైకెత్తి ఉంచుతున్నారు. జూన్ 5నుంచి నేటి వరకు మూసీ గేట్ల నుంచి మొత్తం 16.39టీఎంసీల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

నేడు పోచంపల్లి కోఆపరేటివ్ బ్యాంక్ వార్షికోత్సవం

చండూరు: చండూరు మున్సిపల్ కేంద్రంలోని పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 7వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు బ్యాంక్ మేనేజర్ మంచాల స్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంక్ అభివృద్ధికి సహకరించిన ఖాతాదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు మార్టిగేజ్, గోల్డ్ లోన్, గృహ నిర్మాణానికి సంబంధించిన రుణాలు, వ్యాపార అభివృద్ధికి రుణాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైభవంగా లక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూలవిరాట్‌స్వామికి పంచామృతాభిషేకం చేశారు. అదేవిధంగా స్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ తదితరులు పాల్గొన్నారు.